ప్రజాశక్తి

శనివారం 16 నవంబర్ 2024 5 విజయనగరం





ముస్తాబైన మహాసభ వేదిక ముఖద్వారం

చామలాపల్లి కొండకు ఎర్రజెండా అండా

- సిపిఎం ఆధ్వర్యాన పోరాడి రక్షించుకున్న గొర్రెలు, మేకల పెంపకందారులు
- గిరిజన వర్సిటీ నిర్వాసితులకు మెరుగైన నష్టపరిహారం

వారంతా గొర్రెలు, మేకల పెంపకం దారులు. దశాబ్దాల తరబడి ఓ కొండపై మేకలు, గొర్రెలు పెంచుకుని జీవనం సాగిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు పేరుతో ఆ కొండ నుంచి వారిని దూరం చేసేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించింది. దీన్ని పసిగట్టిన పెంపకం దారులు ఎర్రజెండా నీడకు చేరారు. ఆ జెండా కొండను కాపాడే అజెండాగా తీసుకుంది. గ్రామ సచివాలయం మొదలుకుని, తహశీల్దార్, ఆర్‌డిఒ, కలెక్టరేట్ కార్యాలయల ఎదుట ఉధృతమైన ఆందోళనలు చేపట్టింది. దిగివచ్చిన అధికార యంత్రాంగం వెనక్కి తగ్గి అక్కడ కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దీంతో, బాధితులంతా ఊపిరి పీల్చుకుని ఎర్రజెండాకు సెల్యూట్ కొడుతున్నారు.



దత్తిరాజేరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పెంపకందారులు (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి


దత్తిరాజేరు మండలం చినచామలాపల్లిలో గొర్రెలు, మేకల పంపకం దారులే ఎక్కువ. సుమారు 60కుటుంబాలవారికి ఇదే జీవనాధారం. ఆ ఊరికి ఆనుకునివున్న సర్వే నెంబర్ 1లో ఉన్న కొండపై గొర్రెలను, మేకలను మేపుతూ జీవనం వెల్లదీసేవారు. వీరంతా 1998లోనే వంశీకృష్ణ సహకార సంఘంగా ఏర్పడ్డారు. అప్పటికే ఉన్న జీవో ప్రకారం గొర్రెలు, మేకల పెంపకం కోసం 10ఎకరాల కొండను సాధించుకున్నారు. నాటి నుంచి నేటి వరకు వాటి మేతకు ఇబ్బంది లేకుండా సాగుతోంది. ప్రభుత్వం నుంచి ఇతర సహకారం అందకపోయినా చీకూచింతా లేకుండా బతుకీడుస్తున్నారు. ఇటువంటి తరుణంలో రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఇదే కొండపై వ్యవసాయ పరిశోధనల కోసం ఉపయోగించే కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తలపెట్టింది. ఇందుకోసం సర్వే, సమగ్ర ప్రణాళిక కూడా రూపొందించారు. దీంతో, బాధితులంతా ఒక్కటై సిపిఎం నాయకత్వాన్ని ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఆ పార్టీ నాయకులు కృషి విజ్ఞాన కేంద్రం పేరిట చినచామలాపల్లి వాసులను ఈ కొండకు దూరం చేసే ప్రయత్నం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంగిల్లాపల్లి గ్రామ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన బాధితులు ఐదు రోజులపాటు దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడంతో తహశీల్దార్ కార్యాలయం ముట్టడించారు. అనంతరం ఆర్‌డిఒ, కలెక్టరేట్ కార్యాల వద్ద కూడా ధర్నాలు చేపట్టడంతో అధికార యంత్రాంగం దిగివచ్చింది. ప్రస్తుతం ఆ భూమి జోలికి వెల్లడం లేదని ప్రకటించింది. దీంతో, ప్రస్తుతం గొర్రెలు, మేకల పెంపకం దార్లు ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారు. ఎర్ర జెండా రూపంలో సిపిఎం పార్టీ తమకు కొండంత అండగా నిలబడిందని బాధితులు చెబుతున్నారు.



మెంటాడ మండలం చినమేడపల్లి రెవెన్యూ పరిధిలో గిరిజన విశ్వవిద్యాలయాన్ని తలపెట్టిన సంగతి తెలిసిందే. అందులో నిర్వాసితులుగా మారిన రైతులకు ప్రభుత్వం తగినంత నష్ట పరిహారం ఇవ్వలేదు. పట్టాలు లేవనే పేరుతో మరి కొంతమంది సాగుదారులకు పరిహారం చెల్లించేందుకు మీనమీషాలు లెక్కించింది. దీనిపై సిపిఎం గట్టిగా పోరాటం చేయడంతో సాగుదారులకు రూ.3లక్షలు, పట్టాదారులకు మెరుగైన పరిహారం ప్రభుత్వం చెల్లించింది. సాగు భూముల్లో పర్యావరణం దెబ్బతీసే తవ్వకాలను నిలుపుదలచేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం చేపట్టిన పోరాటం వల్ల దత్తిరాజేరు మండలం బూర్జవలస వద్దగల క్వారీ అనుమతులను ప్రభుత్వం రద్దుచేసింది. సిపిఎం ఆధ్వర్యాన పురిటిపెంట, గజపతినగరం పంచాయతీ కార్మికులు ఐదు రోజులపాటు సమ్మెచేసి రూ.2వేల వేతనాన్ని పెంచుకున్నారు. ఇలా సిపిఎం చేపట్టిన పోరాటాల్లో అనేక ప్రాంతాల్లో వివిధ తరగతుల ప్రజలకు మేలు జరిగింది.

మహాసభకు వేళాయె

- నేడు, రేపు సిపిఎం జిల్లా 10వ మహాసభ
- ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి నుంచి కోట వరకు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ
- హాజరు కానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి, లోకనాథం
- ముస్తాబవుతున్న వెంకట్ సత్య కల్యాణ మండపం
- సీతారాం ఏచూరి నగర్, బుద్ధదేవ్, ఆర్‌ఎస్ ప్రాంగణంగా నామకరణం
- సిపిఎం కార్యకర్తల్లో నూతనోత్తేజం



కోట కూడలిలో తోరణాలు కడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కమ్యూనిస్టులు, సిపిఎం అభిమానులు, సానుభూతిపరులు, పేదలు, కర్షకులు, కార్మికులు, చిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సిపిఎం జిల్లా మహాసభలకు వేళయ్యింది. నేడు, రేపు (శని, ఆదివారాల్లో) 10వ జిల్లా మహాసభలు విజయనగరంలో జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పండగ వాతావరణంలో మహాసభలు నిర్వహించుకునేందుకు పార్టీ కేడర్ సమాయత్తమైంది. సభా ప్రాంగణం ఎర్ర జెండాలతో రెపరెపలాడుతోంది. బహిరంగ సభ జరిగే కోట ప్రాంతంలో కూడా ఎర్రతోరణాలతో అలంకరించారు. మహాసభకు విజయనగరం నుంచి గంట్యాడ వెళ్లే రోడ్డులో అయ్యన్నపేట వినాయకనగర్‌లోని వెంకట్ సత్య కల్యాణ మండపం వేదిక కానుంది. దీనికి కీర్తిశేషులు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నగర్‌గాను, బుద్ధదేవ్ బట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ రాజు ప్రాంగణాలుగా నామకరణం చేశారు. విజయనగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి నుంచి ఉదయం 10గంటలకు నుంచి కన్యకాపరమేశ్వరి, గంటస్తంభం, మూడు లాంతర్ల మీదుగా కోట వరకు భారీ ర్యాలీ సాగనుంది. అందులో పార్టీ కేడర్‌తోపాటు అభిమానులు కూడా భాగస్వామ్యం కానున్నారు. కోట వద్ద బహిరంగ సభ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి వెంకట సత్య కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలను సమీక్షించుకొని, పేదలు, రైతులు, దళితులు, గిరిజనులు వంటి అణగారిన తరగతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన పోరాటాలపై సమగ్రంగా చర్చించనున్నారు. పలు అంశాలపై తీర్మానాలను సభ ఆమోదానికి పెట్టనున్నారు. మొత్తం మహాసభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాటు ఇప్పటికే పూర్తయ్యాయి. ఏర్పాట్లను పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం హాజరు కానున్నారు. మహా సభల నేపథ్యంలో పార్టీ కేడర్‌లో నూతనుత్తేజం కనిపిస్తోంది.

మార్చిలోగా ఎంఎస్‌ఎంఇల సర్వే

విజయనగరం కోట : ఎంఎస్‌ఎంఇ పరిశ్రమలన్నిటినీ వచ్చే మార్చి లోగా సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్ లో పరిశ్రమల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సర్వే పూర్తి చేయడానికి సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ సర్వేలో ఎన్ని ఎంఎస్‌ఎంఇలుఉన్నదీ, వాటి పని తీరు, నిర్వహణ, టర్నోవర్ తదితర అంశాలను నమోదు చేయాలని, సర్వేలో నూతన ఉద్యమం రిజిస్ట్రేషన్ ఉచితంగా చేసుకోవచ్చునని తెలిపారు. సర్వే పై శిక్షణలు , మార్గదర్శకాలు రూపొందిస్తామని తెలిపారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్ : జిల్లా కోర్టులో శనివారం జరగబోయే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి ఎం.మీనా దేవి కోరారు. శుక్రవారం తన ఛాంబర్‌లో శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులతో ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన ఇన్సూరెన్స్ కేసులన్నీ లోక్‌అదాలత్‌తో పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. అందుకు లోక్ అదాలత్ ను వేదికగా చేసుకుని ఎక్కువ కేసులు రాజీ చేసి కక్షిదారులకు డబ్బు, సమయం వృథా కాకుండా చూడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎస్సీ ఎస్టీ కోర్టు జడ్జి అప్పలస్వామి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేయనున్న కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నాయకురాలిగా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ వచ్చిన ఉద్యమ నేత విజయగౌరికి ఎమ్మెల్సీ గా అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు ఎస్.కిషోర్ కుమార్, రెడ్డి మోహనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రాము, జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్ కె ఈశ్వరరావు, జిల్లా గౌరవాధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, జిల్లా కోశాధికారి చింత భాస్కరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక సబ్ ఎడిటర్ కె శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు కె ప్రసాదరావు, యస్ సత్యనారాయణ, ఆర్‌ఎవి సూర్యారావు, సి హెచ్ తిరుపతి నాయుడు, యస్ శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అల్లు శంకరరావు, జిల్లా సిపియస్ సబ్ కమిటీ కన్వీనర్ పి రాంప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి రమణ, పూసపాటి రేగ ప్రధాన కార్యదర్శి జి గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు

నెలాఖరికి రోడ్డు పనులన్నీ ప్రారంభించాలి

రోడ్లు భవనాల శాఖకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో రోడ్లపై గుంతలు పూడ్చేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన మరమ్మత్తు పనులన్నీ నవంబరు నెలాఖరు లోగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రోడ్లు భవనాలశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మంజూరైన మొత్తం 68 రోడ్డు పనులకు గాను ఇప్పటి వరకు 22 పనులు ప్రారంభమైనట్లు రోడ్లు భవనాల శాఖ ఎస్‌ఇ కాంతిమతి వివరించారు. ఇప్పటి వరకు 32కిలోమీటర్ల రోడ్లకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి 79 కిలోమీటర్ల నిడివి గల రోడ్ల మరమ్మత్తులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని కలెక్టర్‌కు వివరించారు. గుంతలు లేని రోడ్లు కార్యక్రమం కింద జిల్లాలో మంజూరు చేసిన రోడ్ల మరమ్మత్తు పనుల పురోగతిపై కలెక్టర్ శుక్రవారం ఆర్ అండ్ బి అధికారులతో సమీక్షించారు. కాంట్రాక్టర్ లతో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో 296 కిలోమీటర్ల మేరకు రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు 68 పనులు మంజూరైనట్టు, వీటిని నిర్ణీత గడువు లోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇఇ జేమ్స్, డిఇలు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

జిల్లా సహకార అధికారి రమేష్ • డిసిఎంఎస్‌లో సహకార వారోత్సవాలు



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి రమేష్

ప్రజాశక్తి-విజయనగరంకోట

దేశవ్యాప్తంగా సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి జరుగుతోందని జిల్లా సహకార అధికారి పి.రమేష్ చెప్పారు. జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం (డిసిఎంఎస్)లో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముందుగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిసిఒ రమేష్ మాట్లాడుతూ, ప్రతీ ఏటా నవంబరు 14 నుంచి వారం రోజులపాటు సహకార వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. 1904లో దేశంలో ఏర్పాటైన సహకార వ్యవస్థ రోజురోజుకూ బలోపేతం అవుతోందని అన్నారు. పారిశ్రామిక రంగంలో కూడా సహకార సంఘాల ప్రాధాన్యతను పెంచేందుకు తాజాగా ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఇప్పటికే ఎరువుల తయారీ, పాలు ఉత్పత్తిలో సహకార సంఘాలు గణనీయమైన విజయాన్ని సొంతం చేసుకున్నాయని తెలిపారు. ఈ రంగంలో మరింత అభివృద్ధిని సాధించేందుకు ఈ ఏడాది సహకార వారోత్సవాల్లో, వికసిత భారత నిర్మాణంలో సహకార సంఘాల పాత్రను అన్న అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకోవడం జరిగిందని చెప్పారు. డిసిసిబి సిఇఒ సిహెచ్.ఉమామహేశ్వర రావు మాట్లాడుతూ, సహకార రంగంలో మూడవ అంచెలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సేవలను విస్తృతం చేసేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. దీనిలో భాగంగా పిఎసిఎస్‌ల కంప్యూటరైజేషన్ జరుగుతోందన్నారు. ఉమ్మడి జిల్లాలో 95 పిఎసిఎస్‌లు ఉన్నాయని, వీటిని కంప్యూటరీకరించే ప్రక్రియను శరవేగంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనిద్వారా సహకార సంఘాలపై మరింత నమ్మకం, పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. ఐసిఎం రాష్ట్ర సమన్వయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కషి చేస్తోందని చెప్పారు. దీనిలో భాగంగా రాష్ట్రాల్లోని సహకార రంగానికి చెందిన వివిధ చట్టాల్లో మార్పులు తీసుకువస్తున్నారని, గ్రామీణ స్థాయిలోని సహకార సంఘాలను కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం చేయకుండా, ఇతర కార్యక్రమాలకు కూడా విస్తరించాలని నిర్ణయించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ ఆడిట్ అధికారి బి.సన్యాసినాయుడు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ బివిఎస్ సాయికుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సర్పంచులకు వినతులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది.. శుక్రవారం పలువురు సర్పంచులకు వినతులు అందించారు. శృంగవరపుకోట మండలంలోని రేవల్లపాలెం సర్పంచ్ జాగరపు కృష్ణమ్మకు కొట్టాం పిహెచ్‌సి పరిధిలోని 104 సిబ్బంది వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ నెల నెలా సక్రమంగా జీతాలు చెల్లించక పోవడంతో కుటుంబాలను పోషించడం చాలా కష్టమవుతోందని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలని కోరారు. అందుకు రూ.50 వేలు ఖర్చవుతుందని, దీనివల్ల ప్రజాధనం వృథా కాదని చెప్పారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒకు జిఒ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని కోరారు. సీనియర్ డ్రైవర్లను కాంట్రాక్టు పద్ధతిలో పెట్టాలని, ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్‌చేశారు. ఉద్యోగులకు యాజమాన్యం నుండి బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు జి.కోటారావు, బి.మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జామి : 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని జామి మేజర్ పంచాయతీ సర్పంచ్ చిప్పాడ లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. యూనియన్ పిలుపులో భాగంగా గ్రామ సర్పంచులకు వినతులు అందిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులు ఆర్.సన్యాసినాయుడు, ఎం.కృష్ణంరాజు పాల్గొన్నారు.

వేపాడ : తమ సమస్యలను పరిష్కరించాలని నల్లబిల్లి సర్పంచ్‌కి 104 సిబ్బంది వినతి అందించారు. 104 సిబ్బంది సమస్యల పరిష్కారానికి సహకరించాలని సర్పంచ్‌ను కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే అవసరమైతే నిరవధిక దీక్షలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.





ఎస్.కోట మండలం రేవల్లపాలెం, జామి మేజర్ పంచాయతీ సర్పంచులకు వినతులు అందిస్తున్న 104 సిబ్బంది



మద్యం దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు, విద్యార్థులు

మద్యం దుకాణాన్ని మార్చాలంటూ మహిళల ఆందోళన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట నుంచి శివరామరాజుపేట వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వేరేచోటికి మార్చాలని శివరామరాజుపేట గ్రామస్తులు శుక్రవారం మద్యం దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ డెయిరీ శీతల కేంద్రం పక్కన ఉన్న వైన్ షాప్ ముందు నుంచి నిత్యం విద్యాసంస్థలకు విద్యార్థినులు, వ్యవసాయం చేసే మహిళలు, కూలీలు నడుచుకుంటూ వెళ్తారని తెలిపారు. మద్యం దుకాణం లేనప్పుడే ఈ పరిసర ప్రాంతాల్లో మందుబాబుల బెడద ఎక్కువగా ఉండేదని ఆందోళన వ్యక్తంచేశారు. తాగిన మైకంలో గతంలో ఈ రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు ఈ నిర్మానుష్య ప్రదేశంలో వైన్ షాప్ పెట్టడం మరింత ప్రమాదకరమని, ఈ దుకాణాన్ని వేరే చోటికి మార్చాలని డిమాండ్‌చేశారు. అంతవరకూ నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

దేశం గర్వించేలా ఆదివాసీలు ఎదగాలి

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ • ఘనంగా బిర్సా ముండా జయంతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భగవాన్ బిర్సా ముండా త్యాగాన్ని తెలుసుకొని, వారు చూపిన మార్గాన్ని అనుసరించి ఆదివాసీలు దేశం గర్వపడేలా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థాయి చేరుకున్న నాడే అందరి గుర్తింపు లభిస్తుందని అన్నారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకునేలా దేశ వ్యాప్తంగా బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించడం ఆయన త్యాగానికి నిదర్శనం అని తెలిపారు. గిరిజనుల అభివృద్ధి కోసం అనేక పథకాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని , వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గిరిజనుల జీవనోపాదులను పెంచడానికి, వారికి మెరుగైన జీవితాన్ని అందించాలనే ఉద్దేశ్యం తో జన మన్ కార్యక్రమం అమలు చేస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా 11 మండలాలకు చెందిన 57 గిరిజన గ్రామాల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. ఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణ రావు మాట్లాడుతూ బిర్సా ముండా జయంతి ఆదివాసీలకు గౌరవం తెచ్చే దినంగా అభివర్ణించారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామానందం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఈ ఉత్సవాల్లో ప్రధాని మోడీ పాల్గొని గిరిజనుల కోసం మూడు కొత్త పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర గిరిజన ఉద్యోగుల సంఘం కార్యదర్శి అలుగు వెంకట రావు , అప్పల నాయుడు దొర బిర్సా ముండా గొప్పదనం పై ప్రసంగించారు. స్వాతంత్ర్య పోరాటంలో తొలి గిరిజన వీరుడు బిర్సా ముండా అని పేర్కొన్నారు. కార్యక్రమాలకు ముందు నిర్వహించిన గిరిజన నత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం లబ్దిదారులకు ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డులను, ఇళ్ల మంజూరు ఉత్తర్వులను కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జెసి సేతు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస మూర్తి, డిఇఒ మాణిక్యంనాయుడు, జిల్లా అధికారులు , గిరిజన ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బిర్సా ముండా జయంతి సభలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

సిటియులో బిర్సా ముండా జయంతి

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆదివాసి గౌరవ దినోత్సవం (ట్రైబల్ ప్రైడ్ డే) ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య తేజస్వి కట్టిమని.. బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ అనిరుద్ కుమార్, కన్వీనర్ డాక్టర్ దివ్య కొనికల్, రిజిస్ట్రార్‌తంత్రవాహి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : గిరిజన స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సా ముండా జయంతిని జనసేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జనసేన నాయకుడు వబ్బిన సన్యాసినాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అందుబాటులో 48 ఇసుక రీచ్‌లు

విజయనగరంకోట : జిల్లాలో 48 ఇసుక రీచ్‌లు అందుబాటులో ఉన్నాయని, ప్రతీ రీచ్ ఒక పంచాయతీ కార్యదర్శిని ఇంఛార్జిగా పెట్టామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఇసుక కావాల్సిన వారు పంచాయతీ కార్యదర్శి యాప్‌లో రిజిస్టర్ చేసుకొని, రసీదును పొందిన తర్వాత ఇసుకను తీసుకు వెళ్లవచ్చునని తెలిపారు. పోలీస్ వారు అడ్డుకున్నప్పటికీ ఆ రసీదును చూపిస్తే వదిలేస్తారని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసారు. రేగిడి మండలం కె.వెంకటాపురం వద్ద కొత్త రీచ్‌కు అనుమతి లభించిందని, సోమవారం టెండర్లను పిలుస్తామని తెలిపారు. డెంకాడ వద్ద కూడా ఒక స్టాక్ పాయింట్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి, డిపిఒ వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఉమా శంకర రావు, గనుల శాఖ, తులసి రావు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేయాలి

విజయనగరం టౌన్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలిపివేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం 'ఉత్తరాంధ్ర కరువు, వలసలు విద్యా, ఉపాధి రంగాలు కర్తవ్యాలు' అనే అంశంపై లేడీస్ క్లబ్‌లో సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభానికి ముందు రైల్వే స్టేషన్ నుండి కాంప్లెక్స్ మీదుగా ఎం.ఆర్. లేడీస్ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ సంఘం ఉమ్మడి విజయనగరం జిల్లా నాయకులు కె. సోమేష్, బి. రాకేష్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో ప్రధాన వక్త వై.వి.ఎస్. మహదేవన్ మాట్లాడుతూ... రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎగ్గొట్టిన చందంగానే ఉత్తరాంధ్రకు కూడా కేంద్ర ప్రభుత్వం అన్యాయమే చేసిందన్నారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లయినా, విభజన చట్టంలోని ఒక్కటంటే ఒక్క అంశం కూడా సంపూర్ణంగా నేటికీ అమలు కాలేదన్నారు. పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్, ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి పాల్గొన్నారు.

పక్కాగా నైపుణ్య సర్వే

ప్రజాశక్తి-విజయనగరంకోట

నిరుద్యోగులైన 15 నుండి 59 సంవత్సరాల మధ్య గల స్త్రీ పురుషులకు, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారికి, విద్యార్థులకు, గృహిణులకు అవసరమైన నైపుణ్యాలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్య సర్వేను జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ నుండి ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు జారీ చేసారు. ప్రతి మండలంలో , మున్సిపాలిటీ లో సచివాలయ సిబ్బందికి సర్వే చేసేందుకు అవవరమైన శిక్షణ ఈనెల 18 నుండి 21 లోపల పూర్తి చేయాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, మున్సిపాలిటీ స్థాయిలో మున్సిపల్ కమిషనర్ ఈ శిక్షణకు నోడల్ అధికారులుగా వ్యవహరించాలని తెలిపారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రశాంత్ కుమార్ , జిల్లా ఉపాధి కల్పన అధికారి అరుణ సర్వే కు బాధ్యత వహించాలని తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లోనూ సర్వే జరగాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని చామలపల్లి పంచాయతీ పరిధిలో శివారు గిరిజన గ్రామం వెంకయ్యపాలెం గిరిజనులకు తాగునీటి సమస్య పరిష్కారమైంది. తాగునీటి బోరు ఏర్పాటుకు మండల పరిషత్తు నిధులు మంజూరు కావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి.దేవి, వర్క్ఇన్స్పెక్టర్ కామేష్ పర్యవేక్షణలో శుక్రవారం బోరు వేశారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో గిరిజనులు సంతోషం వ్యక్తంచేశారు.

మహిళా సంఘాల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-రేగిడి

గ్రామాల్లో మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు రాజాం క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి తెలిపారు. శుక్రవారం మండలంలోని చెలికానివలస గ్రామంలో మహిళా సంఘాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా ఇచ్చిన రుణాల రికవరీకి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు తిరిగి కడితే మళ్లీ బ్యాంకు త్వరితగతిన రుణాలిస్తాయని చెప్పారు. సమావేశంలో ఎపిఎం బాసిన గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పి సిఇఒ బి.వి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలపై శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, విఆఎలకు ఎంపిడిఒ సతీష్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసి, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పంచాయతీలకు వచ్చే ఆర్థిక సంఘం, జనరల్, జల్ జీవన్ మిషన్, మండల పరిషత్తు నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. దేనికి ఏ నిధులు ఖర్చు పెడుతున్నారో రికార్డుల్లో పొందుపరచాలని చెప్పారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల, బిల్లుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేట్ అబ్జర్వర్ సుబ్బారావు, ఇఒపిఆర్‌డి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని బూరాడ జంక్షన్ వద్ద శుక్రవారం రాత్రి రాజాం రూరల్ సిఐ ఉపేంద్రరావు వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్ సరఫరాను దృష్టిలో ఉంచుకొని ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గంజాయి, కొకైన్, ఇతర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు ఎస్ఐలకు తనిఖీలు చేపట్టేలా ఆదేశించామన్నారు. డ్రగ్స్ సరఫరా చేసిన వాహనాలతో పాటు వాటిని సరఫరా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

'వినూత్న ఆలోచనల'పై ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగం 'వినూత్న ఆలోచనలు' అనే అంశంపై శుక్రవారం ప్రదర్శన నిర్వహించింది. విద్యార్థులు ఎంబెడెడ్ సిస్టమ్స్, ఐఒటి, ఇతర డొమైన్‌లను అనుసరించి ఎలక్ట్రానిక్స్‌లో దాదాపు 20కొత్త ఆలోచనలను రూపొందించారు. ఈ ప్రదర్శనను పర్యవేక్షించడానికి ఎంవిజిఆర్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ పి.సూర్యప్రసాద్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రతి ప్రదర్శనలోని విధానం, ఆలోచనలను పరిశీలించి విద్యార్థులను అభినందిస్తూ కొత్త రంగాల్లో కొత్త ఆలోచనలను పెంపొందించు కోవడంపై చర్చించారు. మన దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న వ్యవసాయం, వైద్యం, పరిశ్రమలు వంటి వివిధ రంగాల్లో కొత్త ఆలోచనలు, సాంకేతికతలు ఎలా ఉపయోగించబడుతున్నాయో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు విద్యార్థులకు వివరించారు. విద్యార్థులంతా ప్రస్తుత సాంకేతిక పరిజ్ఞానాన్ని అర్థం చేసుకొని సరైన పద్ధతిలో వినియోగించి సరికొత్త ఆవిష్కరణలు చేసి దేశాభివద్ధిలో భాగం కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి , ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ టిడివిఎ నాయుడు పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో గణితంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఎంఆర్ కళాశాలలో గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యాన శుక్రవారం గణితంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చెన్నై మాథ్స్ ఇనిస్టిట్యూట్ లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.సుందరి హాజరయ్యారు. వాస్తవ సంఖ్యా సమితులు, లేజర్ చికిత్స, త్రికోణమితియ ఆవర్తన ప్రమేయాలపై వివరించారు. గణితశాస్త్ర విభాగాధిపతి ఎస్.సూరిబాబు మాట్లాడుతూ గణిత శాస్త్ర ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సాంబశివరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టినరోజున పది మొక్కలు నాటుదాం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) ఆధ్వర్యంలో రైల్వే పిడబ్ల్యుఐ కార్యాలయ రహదారి పక్కన పుట్టిన రోజున పది మొక్కలు నాటుదాం కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపకులు బి.రామకృష్ణ శుక్రవారం నిర్వహించారు. కె.ధరణి చార్వి, సిమ్ డైరెక్టర్ వై.విజయలక్ష్మి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ఆర్‌టిసి డిపో మేనేజర్ కోటంశెట్టి రమేష్ అతిథిగా హాజరయ్యారు. కె.షణ్ముఖ, దీక్షిత, జోయా, ఆశా, హృషీకేశ్, లాస్యశ్రీ, రైల్వే సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

గ్రోత్‌సెంటర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గ్రోత్‌సెంటర్‌లో సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బేబినాయనకు కృతజ్ఞతలు తెలిపారు. పారిశ్రామిక వాడలో మౌలిక సదుపాయాలు చాలా దారుణంగా ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా రహదారులు, తాగునీటి సౌకర్యం, కాలువలు, రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచడంపై దృష్టిసారించాలని కోరారు. పారిశ్రామిక వాడలో ఎన్ని యూనిట్లు ఖాళీగా ఉన్నాయో తెలిపే చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి త్వరితగతిన అనుమతులు, బ్యాంకు రుణాలు వచ్చే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తిచేశారు.

నేరాలు ఘోరాలు

మద్యం తరలిస్తుండగా వ్యాపారి అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

బెల్ట్‌షాపు నిర్వహణకు మద్యం తరలిస్తున్న వ్యాపారిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ కె.సతీష్‌కుమార్ చెప్పారు. మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన చోడి పైడిరాజు బెల్ట్‌షాపు నిర్వహణకు మద్యం తరలిస్తుండగా పట్టణంలోని దక్షిణదేవుడి వద్ద హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ నాగేశ్వరరావు పట్టుకున్నారు. ఆయన వద్ద ఉన్న 46 మద్యం సీసాలను సీజ్ చేశారు. ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి-బొబ్బిలి

సారా తయారీ కోసం నిల్వ చేసిన 400 లీటర్ల బెల్లం ఊటను శుక్రవారం ఎక్సైజ్ సిబ్బంది ధ్వంసం చేశారు. మండలంలోని కొయ్యకొండవలసలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు తమ సిబ్బందితో దాడి చేశారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ శ్రావణ్‌కుమార్, హెచ్‌సి ఎం.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ ప్రసాదరావు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-పూసపాటిరేగ

మండలంలోని కొప్పెర్లలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జోనల్ స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సాంఘిక సంక్షేమ గురుకులాల సంయుక్త కార్యదర్శి ఎన్.సంజీవరావు, జోన్-1తోపాటు మూడు జిల్లాల సమన్వయ అధికారులు టి.ఎం.ఫ్లోరెన్స్, ఎం.బాలాజీ నాయక్, ఎస్.రూపవతి ఈ పోటీలను ప్రారంభించారు. ఉత్తరాంధ్రలోని 12 బాలుర గురుకులాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సంయుక్త కార్యదర్శి ఎన్.సంజీవరావు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల ఆరోగ్యానికి, శారీరక దృఢత్వానికి, మానసిక వికాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలతోపాటు క్రమశిక్షణ, విద్యారంగంలో ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రారంభోత్సవంలో వియ్యంపేట విద్యార్థినుల థింసా నృత్యం, శారీ డ్రిల్లు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌డిఒ ఎస్.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ టి.గోవిందరావు, డిప్యూటీ డిఇఒ కెవి రమణ పాల్గొన్నారు.

తొలిరోజు విజేతలు

జూనియర్ విభాగంలో క్యారమ్స్‌లో పాలకొండ, చదరంగంలో సాలూరు గురుకుల విద్యార్థులు విజేతగా నిలిచారు. 100 మీటర్ల పరుగు పందెంలో బి.గణేష్, ఎస్.గౌరీశంకర్, జె.వినయ్ కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 800 మీటర్ల పరుగు పందెంలో ఆర్.తరుణ్ (దేవరపల్లి), ఎ.తరుణ్‌రాజ్ (కంచిలి), ఎ.రామ్‌చరణ్ (కొప్పెర్ల) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. 1500 మీటర్ల పరుగు పందెంలో బి.పృథ్వి (దేవరాపల్లి), ఎ.రామ్‌చరణ్ (కొప్పెర్ల), హర్ష (సాలూరు) మొదటి మూడు స్థానాలు సాధించారు. షార్ట్‌పుట్‌లో కె.చరణ్ తేజ (సాలూరు) కె.అమృతవర్ధన్ (పార్వతీపురం), కె.తరుణ్ (సాలూరు), డిస్క్‌త్రోలో కె.చరణ్ తేజ (సాలూరు), పి.హర్ష, బి.కరుణ (పాలకొండ) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు.

సీనియర్ విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో కె.యాదగిరి (కంచిలి), ఎస్.చరణ్, సుధీర్ (పార్వతీపురం), 800 మీటర్ల పరుగు పందెంలో ఎస్.విజ్ఞాన్, అచ్యుతరావు (కొప్పెర్ల), ఎన్.రంజిత్ (సాలూరు) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. 1500 మీటర్ల పరుగు బంధం విభాగంలో ఎస్.విజ్ఞాన్ (దుప్పలవలస) డి.దీక్షిత్, ఆర్.శివకృష్ణ (శ్రీకృష్ణాపురం), షార్ట్‌పుట్ విభాగంలో సిహెచ్ అభి (శ్రీకృష్ణాపురం) జె.రోహిత్ (దుప్పలవలస), ఆర్.యశ్వంత్ (సాలూరు), డిస్క్‌త్రోలో సిహెచ్ భారత్ (శ్రీకృష్ణాపురం), జి.జశ్వంత్ (పార్వతీపురం), పి.రాజకుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.




పోటీలను ప్రారంభిస్తున్న గురుకులాల సంయుక్త కార్యదర్శి సంజీవరావు ; కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

సమస్యల పరిష్కారానికి వెల్ఫేర్‌డే

ప్రజాశక్తి-విజయనగరంకోట

సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీసు వెల్ఫేర్‌డే నిర్వహిస్తున్నామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'పోలీసు వెల్ఫేర్ డే' నిర్వహించారు. సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు.

సిఎం సహాయనిధికి జిఎంఆర్ రూ.8.95 లక్షలు విరాళం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ముఖ్యమంత్రి సహాయ నిధికి జిఎంఆర్ గ్రూప్ రూ.8,95,496 విరాళాన్ని అందజేసింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు సంస్థ ప్రతినిధులు శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో అందజేశారు. వారిని కలెక్టర్ అభినందించారు. జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, జిఎంఆర్ఐటి ప్రిన్సిపల్ డాక్టర్ సిఎల్‌విఆర్‌ఎస్‌వి ప్రసాద్, జిఎంఆర్ కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ ఆర్.అన్నంనాయుడు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- 42 మంది అరెస్టు
- రూ. 17,34,190 నగదు స్వాధీనం
- పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్‌పి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి వకుల్, పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని ఎస్‌విఎన్ నగర్ సుజాత ఫంక్షన్ హాలులో పేకాట నిర్వహణ శిబిరంపై డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యాన శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా పేకాట నిర్వాహకుడితో పాటు పేకాడుతున్న 42మందిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.17,34,190 నగదును స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా 49 సెల్‌ఫోన్లు, 2 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గదులను అద్దెకు తీసుకున్నట్లు అగ్రిమెంట్ కాపీని టూటౌన్ పోలీసులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. గతంలో పేకాట కేసులున్న వారిపై షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడా ఆర్గనైజ్డ్ గా పేకాట జరగకూడదని, ఎవరైనా పేకాట నిర్వహిస్తూ, పట్టుబడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. సుజాత ఫంక్షను హాలులో కొంతమంది వ్యక్తులు గదులను అద్దెకు తీసుకొని, పేకాట నిర్వహిస్తున్నట్లుగా నవంబరు 14న పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ కృష్ణమూర్తి మరియు ఇతర పోలీసు బందంతో రైడ్ చేసి, పేకాట నిర్వహిస్తున్న పూసపాటిరేగకు చెందిన కాకర్లపూడి కృష్ణమూర్తి రాజుతో సహా పేకాట ఆడుతున్న మరో 41 మందిని అరెస్టు చేసామన్నారు. పేకాటలో పట్టుబడిన వారిలో విజయనగరం జిల్లాకు చెందిన వారు 15మంది, శ్రీకాకుళం జిల్లాకు చెందిన 6గురు, విశాఖపట్నంకు చెందిన వారు 9మంది, అనకాపల్లి జిల్లాకు చెందిన వారు 11 మంది, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వారు ఒకరు ఉన్నారన్నారు. వీరిలో 14మంది ఇప్పటికే వివిధ పోలీసు స్టేషను పరిధిలో పేకాట ఆడుతూ, పలుమార్లు పట్టుబడినట్లుగా కేసులు ఉన్నాయన్నారు. తరుచూ పేకాట ఆడుతున్న వారిపై షీట్లు తెరుస్తామన్నారు. పేకాట నిర్వహించడంలో ఫంక్షను హాలు నిర్వాహకుల పాత్రపై కూడా విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి తెలిపారు. పేకాట రైడ్ నిర్వహణలోను, ముందస్తు సమాచారాన్ని సేకరించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన డిఎస్‌పి శ్రీనివాసరావు, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం.కృష్ణమూర్తి, ఎఎస్ఐ బి. గౌరి నాయుడు, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత పాల్గొన్నారు.

పిఎంఎవై ఇళ్ల పరిశీలన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో ఎన్‌టిఆర్ నగర్‌లో పిఎంఎవై ఇళ్లను శుక్రవారం కమిషనర్ కె.అప్పలరాజు పరిశీలించారు. ఇక్కడ 576 ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంత వరకు జరిగిన నిర్మాణ పనుల స్థాయి, ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి టిడ్కో ఇంజినీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా 0.3 ఎంఎల్‌డి సామర్థ్యంతో నిర్మించిన సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను, 200 కెఎల్ సామర్థ్యంతో నిర్మిస్తున్న జిఎల్ఎస్ఆర్ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్ నుండి బ్లాక్‌ల వారీగా ఇళ్లకు విద్యుత్ సరఫరా కోసం ప్రస్తుతం చేపడుతున్న విద్యుత్తు స్తంభాల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో నివాసాలకు ఇంటి పన్ను విధిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం సారిపల్లిలో 2656 మంది లబ్ధిదారులకు టిడ్కో ద్వారా నిర్మించిన ఇళ్లను పరిశీలించారు. అందులో ప్రస్తుతం నివశిస్తున్న సుమారు 120 కుటుంబాలకు ఇంటి పన్ను విధించేందుకు, స్థానికుల సంఖ్య, వారికి కల్పిస్తున్న మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ ఉమా భాస్కర్, టిడ్కో సామాజికాభివృద్ధి స్పెషలిస్ట్ ఎస్.వెంకట రమణ, ఎఇ అనిల్, సురేష్ పాల్గొన్నారు.



ఇళ్లను పరిశీలిస్తున్న కమిషనర్ అప్పలరాజు

ఐఒసిని సందర్శించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని చీపురువలసలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సంస్థను విజయనగరం ఆర్‌డిఒ డి.కీర్తి శుక్రవారం సందర్శించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు కేటాయించిన భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో ముందస్తు అనుమతులు లేకుండా తవ్వకాలు చేయకూడదని ఆదేశించారు. ఎటువంటి అభ్యంతరాలున్నా తెలియజేయాలని ఆర్‌డిఒ సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.నీలకంఠరావు, ఎంఆర్ఐ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ కీర్తి

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

విజయనగరం టౌన్ : విజయనగర పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు, వినియోగంపై దాడులు ముమ్మరంగా సాగుతున్నాయి. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్య సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు హోల్ సేల్ మరియు రిటైల్ వర్తకుల వద్దకు వెళ్లి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై దాడులు నిర్వహించి ఆయా వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు అపరాధ రుసుం కూడా విధిస్తున్నారు. ప్రజలలో మరింత అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

అన్న క్యాంటీన్లను పరిశుభ్రంగా ఉంచాలి

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్నార్తుల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లు ఆరోగ్యకరమైన ఆహారం అందించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శుక్రవారం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా అన్నా క్యాంటీన్లు, పూర్తిచేసిన అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్‌ను పరిశీలించి, అక్కడ అందిస్తున్న ఆహార పదార్థాలను పరీక్షించారు. ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న టీ, టిఫిన్ దుకాణదారులు చెత్తలను రహదారులపై పడవేస్తుండటాన్ని గమనించి సదరు వ్యాపారులను మందలించారు.



అన్న క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

పుట్‌పాత్ వ్యాపారాలను ఉపేక్షించేది లేదు

ఫుట్ పాత్‌లపై వ్యాపారాలను ఉపేక్షించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగర పరిధిలో అనేక చోట్ల ఫుట్ పాత్ (నడకదారుల) పై చిరు వ్యాపారులు బడ్డీలు, తోపుడుబళ్ళు పెట్టి వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వాటిని తక్షణమే తొలగించాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించామన్నారు.

వరి కోతల్లో రైతులు బిజీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగు తున్నాయి. దీంతో రైతులు పొలాల్లో బిజిబిజీగా కనిపిస్తున్నారు. వరి పంట కోతలతోపాటు కోసిన పంటను ఏ క్షణంలో వర్షం వచ్చినా తడవకుండా కాపాడుకునేందుకు పొలాల్లోనే చిన్న చిన్న కుప్పలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు.



కోసిన వరిచేనును కుప్పలుగా వేస్తున్న రైతు కుటుంబం

నేడు అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విఒఎలకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ సిహెచ్.సూర్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీలు అభివృద్ధి ప్రణాళికపై ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మండలంలోని పంచాయతీ రాజ్ జెఇ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ, ఎపిఒ, ఎంఇఒ, పిహెచ్‌సి, వెటర్నరీ వైద్యులు, విఒఎలు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

'కాపుశంభం' విద్యార్థులకు బంగారు పతకం

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని కాపుశంభం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు బాల చిత్రకళా సృష్టి బంగారు పతకాన్ని సాధించారు. ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ కళాయజ్ఞ సృష్టి అకాడమీ నిర్వహించిన బాలల, యువజనుల జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలో వీరు పాల్గొని సత్తాచాటారు. విద్యార్థులు.. రఘుమండ అనూష (పదో తరగతి), గొర్లె స్వాతి (9వ తరగతి), పెరుమాళి లక్ష్మి (8వ తరగతి), రేగాన చైతన్య (6వ తరగతి)కి ఈ అవార్డు దక్కింది. ఆర్ట్స్ టీచర్ అద్దాల కుమార్‌కు చిత్రగురు అవార్డునిచ్చి సత్కరించారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలను నిర్వాహకులు అందించారు. విద్యార్థులను, ఆర్ట్ టీచర్‌ను ప్రధానోపాధ్యాయులు డి.రాము, ఎస్ఎంసి చైర్మన్ పిన్నింటి రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శనలు



బొబ్బిలి శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు, యువత

ప్రజాశక్తి-విజయనగరంకోట

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పలు గ్రంథాలయాల్లో శుక్రవారం పుస్తక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం విజయనగరంలో శుక్రవారం 8,9,10తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి. లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతితో పాటు ప్రశంసా పత్రం అందిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ గ్రంథాలయాధికారి కె.శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం గాజులరేగ శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ విద్యార్థులకు వరస వారీగా ఉన్న ప్రఖ్యాత పుస్తకా లను చూపించి వాటి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమం గ్రంథాలయాధికారి ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది.

విజయనగరం టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దాసన్నపేటలో గల గిడుగు జానపద బాలల గ్రంథాలయానికి పుస్తకాలను వితరణగా అందజేశారు. సంఘం అధ్యక్షులు ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గౌరవాధ్యక్షులు నాలుగెస్సులరాజు, గ్రంథాలయ నిర్వాహకులు బద్రి కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.చంద్రశేఖర్ పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు రామాయణ, మహాభారతం, కథల పుస్తకాలను ప్రదర్శించారు.

బొబ్బిలి : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని గ్రంథాలయ అధికారి స్వర్ణకుమారి కోరారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. అన్ని రకాల కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులు, యువతను ఆమె కోరారు.

రేగిడి : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం నిర్వహించారు. ఈ పుస్తక పఠనాన్ని ఎంఇఒ ఎం.వరప్రసాదరావు పరిశీలించారు. పలు గ్రామాల నుంచి హాజరైన విద్యార్థులను బహుమతులకు ఎంపిక చేశారు. ఆయనతోపాటు గ్రంథాలయ అధికారి పెంట ఈశ్వరరావు ఉన్నారు.

డెంకాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేశ్, పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు.

జామి : భీమసింగిలోని బాలాజీ జూనియర్ కళాశాలలో జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు - గ్రంథాలయాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు, ప్రిన్సిపల్ శ్రీ శ్రీనివాసరావు, ఒకేషనల్ విభాగం అధిపతి సురేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.




డెంకాడ, వేపాడ గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలు



గ్రంథాలయంలో పత్రిక, పుస్తక పఠనం చేస్తున్న పాఠకులు

గ్రంథాలయానికి ప్రభుత్వ ఆదరణ కరువు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ప్రభుత్వాలు నెలకొల్పిన, ప్రజలు ఏర్పాటుచేసిన గ్రంథాలయాలకు సర్కారు ఆదరణ నేడు కరువైంది. ఎప్పుడో ఏడాదికి ఒకసారి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి, తరువాత వాటి నిర్వహణ ఊసే ఎత్తడం లేదు. ప్రజలకు విజ్ఞానం పంచి, చైతన్యవంతులను చేసేందుకు గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య, పోలేపల్లి వెంకన్న శ్రేష్ట, నూరి వెంకట నరసింహం, పోతూరి నాగరాజు తదితర గ్రంథాలయ ఉద్యమకారులు గ్రంథాలయాల ఏర్పాటుకు కృషిచేశారు. బొబ్బిలిలో నిర్వహిస్తున్న గ్రంథాలయానికి సొంత భవనం లేదు. చింతాడ గ్రామంలో గత 17 సంవత్సరాలుగా దాతలు సహకారంతో ప్రయివేటుగా గురజాడ గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. దాని నిర్వహణకు సంవత్సరానికి రూ.20 వేలు ఖర్చు చేస్తున్నారు. కానీ, ప్రభుత్వపరంగా ఆదరణకు నోచుకోలేదు. ఈ గ్రంథాలయంలో వెయ్యి వరకు వివిధ పోటీ పరీక్షల, రామాయణ, భాగవతం, తదితర పుస్తకాలు ఉన్నాయి. నిత్యం 60 మంది వరకు పుస్తకపఠనం చేస్తున్నారు. ఈ గ్రంథాలయ నిర్వహణకు నెలకు రూ.వెయ్యి ఇస్తూ, రోజువారి పేపర్లు, అవసరమైన పుస్తకాలు కొనుగోలుకు కమిటీ సభ్యులు నిధులు సమకూర్చుతున్నారు. గ్రామంలో ఉద్యోగం వచ్చిన వారి మొదటి జీతం గ్రంథాలయానికి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ గ్రంథాలయంలో చదువుకొని యామలపిల్లి అప్పలనాయుడుకు గ్రూప్-4 ఉద్యోగం వచ్చిందని నిర్వాహకులు తెంటు శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి సంవత్సరం ఐదుగురు కమిటీ సభ్యులు గ్రంథాలయ నిర్వహణకు డబ్బులు పోగు చేస్తామని శ్రీనివాసరావు అన్నారు. ఇలాంటి గ్రంథాలయాలను ప్రభుత్వమే నిర్వహించి ప్రజలకు విజ్ఞానాన్ని అందివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.